సాక్షి
కర్నూలు
శుక్రవారం। 12। ఏప్రిల్। 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్యాన్నదాన పథకానికి గురువారం హైదరాబాదుకు చెందిన సత్యనారాయణ రూ.1,00,116 విరాళాన్ని ఆలయ ఏఈఓ ఫణిధర ప్రసాద్‌కు అందజేశారు.



చిత్రం.. సామరస్య సు'గంధం'

ఆదోని రూరల్: రంజాన్ పండుగ సందర్భంగా మత సామరస్యాన్ని చాటుతూ నారాయణపురం గ్రామానికి చెందిన మల్లికార్జున గంధం చెక్కపై జామియా మసీదు చిత్రాన్ని గీశారు.



వీనుల విందుగా..

శ్రీశైలం టెంపుల్: నిత్యకళా వేదికపై గురువారం పామర్రుకు చెందిన మారుతి లక్ష్మీ శ్యామల బృందం భక్తి సంగీత కార్యక్రమం భక్తులను విశేషంగా అలరించింది.



'దివ్య' ప్రార్థన
దువా చేస్తున్న దివ్యాంగుడు

సమత.. మమత

రంజాన్ పండుగను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆత్మీయ పలకరింపుల మధ్య సంతోషాలను పంచుకున్నారు. పండుగలో సమత..మమత వెల్లివిరిసింది.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

చిన్నారి భక్తి: ప్రార్థనలో పాల్గొన్న బాలిక



జొహరాపురంలో ప్రార్థనలకు హాజరైన మహిళలు



కర్నూలులో పాత ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

న్యూస్‌రీల్

సామాజిక దార్శనికులు జ్యోతిరావు పూలే

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన



పూలే విగ్రహానికి నమస్కరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(అర్బన్): కుల వివక్షకు వ్యతిరేకంగా సమ సమాజం కోసం పోరాడిన బహుజన తత్వవేత్త, సామాజిక దార్శనికులు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. పూలే జయంతి సందర్భంగా ఆమె గురువారం ఉదయం స్థానిక షరీన్‌నగర్‌లోని పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దళిత, బహుజన, మహిళల అభ్యున్నతి కోసం పూలే జీవిత కాలం శ్రమించారన్నారు. స్త్రీలు విద్యావంతులు కావాలని తన భార్య సావిత్రీబాయిని పాఠశాలకు పంపి ఆదర్శంగా నిలిచారన్నారు. పూలేను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె, డోన్‌లో అధిక ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నంద్యాల జిల్లాలో ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. డోన్, బనగానపల్లె మండలాల్లో 42.6 డిగ్రీలు, బండిఆత్మకూరు మండలంలో 42.4, చాగలమర్రి మండలంలో 42.3, మంత్రాలయం మండలంలో 41.6, కొత్తకోటలో 40.9, కోడుమూరులో 40.8, హొళగుందలో 40.7 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా మూడు రోజుల నుంచి ఎండలు, వడగాలుల తీవ్రత తగ్గినట్లు విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు తెలిపారు.

ఊపందుకున్న 'ఉపాధి' పనులు

- ప్రతి మండలంలో రోజుకు 5వేల మందికి పనులు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జిల్లాలో ఊపందుకున్నాయి. ప్రతి మండలంలో రోజుకు కనీసం 5 వేల మంది ఉపాధి పనులకు హాజరయ్యే విధంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రణాళికలు రూపొందించింది. ఈ ఆర్థిక సంవత్సరం జూన్ వరకు జిల్లాకు 45 లక్షల పని దినాలను ప్రభుత్వం లక్ష్యంగా ఇచ్చింది. జిల్లా యంత్రాంగం 29,742 పనులను గుర్తించి సిద్ధంగా ఉంచుకుంది. ఇందులో ఉపాధి నిధులతో వివిధ శాఖల్లో 6,856, పూడికతీతకు సంబంధించి 9,981, ప్లాంటేషన్‌కు సంబంధించి 3,215 పనులు సిద్ధంగా ఉన్నాయి. ఈ పనుల ద్వారా 2.09 కోట్ల పని దినాలు కల్పించే అవకాశం ఉంది. 2024–25లో 1,010 అమృత్‌సరోవర్‌లు, 9,660 ఫాంపాండ్స్, 155 రూఫ్‌వాటర్ స్ట్రక్చర్లు నిర్మించేందుకు జిల్లాకు గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లాకు లక్ష్యాన్ని ఇచ్చింది. ఇప్పటి వరకు 39 అమృత్ సరోవర్లు, 1,140 ఫాంఫాండ్స్, 42 రూఫ్ వాటర్ స్ట్రక్చర్లు మంజూరయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 10 వేల ఎకరాల్లో పండ్లతోటలు 100 శాతం సబ్సిడీతో అభివృద్ధి చేయాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 4,000 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి లబ్ధిదారులను గుర్తించారు.

జననేత ఔదార్యం.. అన్నదాతకు హక్కు ధైర్యం

దశాబ్దాలుగా భూ సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి ఏ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. తమ భూములను చుక్కల జాబితా నుంచి తొలగించాలని అన్నదాతలు వేడుకున్నా పట్టించుకోలేదు. 50ఏళ్లకుపైగా అసైన్‌మెంట్ భూములను అనుభవిస్తున్నామని, వాటిపై హక్కులు కల్పించాలని కోరినా చెవిన పెట్టలేదు. జీవనాధారంకోసం ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్నామని, వాటికి పట్టాలు ఇవ్వాలని ఎన్ని వినతులు ఇచ్చినా ఎవరూ స్పందించలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అన్నదాతల భూ సమస్యలపై స్పందించారు. చుక్కల భూములు, అసైన్‌మెంట్ భూములకు చక్కటి పరిష్కారం చూపారు. అనుభవదారులకు పెద్ద పీట వేస్తూ నిషేధిత జాబితాలో ఉన్న ఆయా భూములను తొలగించి అన్నదాతలకు యాజమాన్య హక్కులు ఇచ్చారు. దీంతో బాధిత కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. –కర్నూలు(సెంట్రల్)

- అసైన్డ్, ఇనాం సర్వీసు భూముల యజమానులకు సంపూర్ణ హక్కులు
- జిల్లాలో నిషేధిత జాబితా 22ఏ నుంచి 30 వేల ఎకరాల వరకు తొలగింపు
- చుక్కల భూముల సమస్య లేకుండా అన్నదాతలకు మేలు చేసిన సర్కార్
- ఎస్సీ కార్పొరేషన్ భూములు పొందిన వారికి భూ యాజమాన్య హక్కులు
- కొత్తగా సాగులో ఉన్న 4,598 మంది రైతులకు భూ పట్టాల పంపిణీ
- నిరుపేదలకు భూపంపిణీ ఘనత సీఎం వైఎస్ జగన్‌దే!



రాష్ట్రంలో 1954 కంటే ముందు అసైన్‌మెంట్ భూములను పొందిన రైతులకు యాజమాన్య హక్కులు ఉన్నాయి. ఆ తరువాత అసైన్‌మెంట్‌లో భూములు పొందిన వారికి యాజమాన్య హక్కులు లేవు. ఎన్నో ఏళ్లుగా భూములను అనుభవించుకుంటున్నా వాటిపై హక్కులు లేకపోవడంతో అత్యవసర సమయాలు, పిల్లల పెళ్లిళ్లు, ఇతర అవసరాలకోసం వాటిని తాకట్టు పెట్టి రుణాలను పొందడానికి అవకాశం లేకపోయింది. ఈ క్రమంలో తమ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు. 1954 తరువాత వచ్చిన ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి రైతుల సమస్యను పట్టించుకోలేదు. 2019లో సీఎం అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసైన్‌మెంట్ దారులకు హక్కులు కల్పించాలని నిర్ణయించారు. 20 ఏళ్ల అనుభవం ఉన్న అసైన్‌మెంట్, ఇనాం సర్వీసు దారుల భూములను నిషేధిత జాబితా 22ఏ నుంచి తొలగించారు. జిల్లాలో సుమారు 15వేల మంది రైతులకు సంబంధించి 30 వేల ఎకరాల వరకు అసైన్‌మెంట్, ఇనాందారులకు హక్కులు కల్పించారు.

చుక్కల భూములకు చక్కటి పరిష్కారం

బ్రిటీషు కాలం నాటి నుంచి చుక్కల భూముల సమస్య ఉంది. రెవెన్యూ రికార్డుల్లో కొంతమంది రైతుల పేర్ల స్థానంలో డాట్స్ ఉన్నాయి. వీటిని చుక్కల భూములు లేదా డాటెడ్ ల్యాండ్స్ అంటూ వస్తున్నారు. అయితే డాటెడ్ ల్యాండ్స్‌ను కూడా నిషేధిత జాబితాలో ఉంచారు. దీంతో రైతులు రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లను చేర్చి 22ఏ జాబితానుంచి తొలగించాలని కోరుతున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తమ పార్టీ నాయకుల డాటెడ్ ల్యాండ్స్‌ను మాత్రమే తొలగించి సొమ్ము చేసుకున్నారు. జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చుకోలేని పేద రైతులు వైఎస్ జగన్ సీఎం అయ్యాక మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాటెట్ ల్యాండ్స్ జాబితా స్థానంలో రైతుల పేర్లను రెవెన్యూ రికార్డుల్లో చేర్చారు. అంతేకాక వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించి క్రయ, విక్రయాలకు అవకాశం కల్పించారు. కర్నూలు జిల్లాలో 9,541 ఎకరాల డాటెడ్ ల్యాండ్స్‌ను 22ఏ జాబితా నుంచి తొలగించి అనుభవందారులుగా ఉన్న రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించారు.

14 ఏళ్ల తరువాత మళ్లీ భూపంపిణీ

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ తన హయాంలో ఎంతోమంది పేదలకు భూ పంపిణీ చేసి ఆదుకున్నారు. అనంతరం మళ్లీ 14 ఏళ్లకు ఆయన తనయుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూపంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భూమి లేని నిరుపేదలకు ఆనాడు వైఎస్ఆర్ ఆసరాగా నిలిస్తే నేడు సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. జిల్లాలో భూమిలేని 2,582 మంది పేదలకు 3,002.18 ఎకరాలను పంపిణీ చేశారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



మేము చాలా బీదవాళ్లం. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిని పోషించుకోవడం, చదివించడం కోసం రోజూ కూలి పనికి వెళ్లక తప్పదు. గ్రామ పొలిమేరలో 1.04 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ ఉన్నాం. అయితే ఆ భూమికి సంబంధించి ఎలాంటి పత్రాలు గాని హక్కులుగాని లేవు. ఈ క్రమంలో అధికారులు పిలిచి మళ్లీ మాకు పట్టా ఇచ్చారు. ఇంతకంటే సంతోషం మా జీవితంలో ఉండదు. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఎం.మార్తమ్మ, పులకుర్తి, కోడుమూరు మండలం

పట్టాకు ప్రాణం పోశారు



మాకు అసైన్డ్ పట్టా భూమి ఉంది. అయితే దానిపై మాకు ఎలాంటి హక్కులు లేవు. పిల్లల పెళ్లిళ్ల సమయంలో బ్యాంకులో తనాఖా కోసం వెళితే చెల్లదన్నారు. అప్పుడు ఎందుకు పనికిరాదని బాధ పడ్డాం. అయితే సీఎంగా వైఎస్ జగన్ వచ్చాక ఆ పట్టాకు ప్రాణం పోశారు. దానిపై సంపూర్ణ హక్కులు మాకు ఇచ్చారు. ఇది మా జీవితంలో ఎంతో మార్పును తెచ్చింది. మాకు ఎంతో మేలు చేసిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

–ఇమేలమ్మ, పులకుర్తి, కోడుమూరు మండలం

రూ.23 వేల కోట్లతో మైనార్టీల సంక్షేమం

- ముస్లింల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ప్రశ్నించిన ముస్లింలపై దేశద్రోహం కేసులు పెట్టిన చరిత్ర చంద్రబాబుది
- విలేకరుల సమావేశంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



ఈనాడులో వచ్చిన కథనాన్ని చూపిస్తూ మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో మైనార్టీల సంక్షేమానికి రూ. 23 వేల కోట్లు ఖర్చు చేశారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తెలిపారు. చంద్రబాబు హయాంలో ముస్లింలకు ఖర్చు చేసిన మొత్తం, సీఎం జగన్ పాలనలో ముస్లిం వర్గాల కోసం ఖర్చు పెట్టిన మొత్తంపై చర్చకు చంద్రబాబు, నారా లోకేష్ సిద్ధమా.. అని సవాల్ విసిరారు. గురువారం కర్నూలు ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఈనాడులో వచ్చిన కథనాన్ని ఖండించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల చదువులకు పెద్ద పీట వేశారన్నారు. విదేశీ విద్య పేరుతో ఒక్కొక్కరికి రూ.1.25 కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. మైనార్టీలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని గుర్తు చేశారు. మైనార్టీలకు అనేక పదవులు ఇచ్చారని, ప్రస్తుతం ఏడు అసెంబ్లీ సీట్లు కేటాయించారన్నారు. మైనార్టీ కోటాలో తనకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. వైఎస్సార్ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేశారని, ఈ రిజర్వేషన్లు తొలగిస్తామని చెప్పిన భారతీయ జనతాపార్టీతో టీడీపీ అధినేత పొత్తు పెట్టుకున్నారన్నారు. నంద్యాలలో ప్రశ్నించిన ముస్లింలపై దేశ ద్రోహం కేసులు పెట్టిన ఘనత చంద్రబాబుదే అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబుకు ముస్లింలు కనిపించలేదని, ఇప్పుడు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ముస్లిం వర్గాలకు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రంజాన్ తోఫా అంటూ ముస్లింలకు నాసిరకం వస్తువులు ఇచ్చి అవమానించలేదా అంటూ ప్రశ్నించారు. చంద్రబాబు పాలన అంతా దోపిడీ అని, అమరావతి రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేశారని విమర్శించారు.

ఇతర రాష్ట్రాల మద్యాన్ని కట్టడి చేయండి

- జిల్లాలో సెబ్ అసిస్టెంట్ కమిషనర్ విస్తృత పర్యటన



పంచలింగాల చెక్‌పోస్టులో తనిఖీలు చేస్తున్న సెబ్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

కర్నూలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ ఎం.సుధాకర్‌రెడ్డి జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా సరిహద్దులోని పంచలింగాల, సుంకేసుల, బాపురం, ఛత్రగుడి చెక్‌పోస్టులతో పాటు ఆదోని, కోసిగి, ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు సెబ్ స్టేషన్లలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టులలో భద్రత మరింత కట్టుదిట్టం చేయాలని ఆయా చెక్‌పోస్టులలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచించారు. పంచలింగాల చెక్‌పోస్టులో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సుబ్బయ్య, ఎస్‌ఐ జి.రాజశేఖర్ విధులు నిర్వహిస్తుండగా అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసి తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ నుంచి జిల్లాలోకి మద్యం రాకుండా తనిఖీలు విస్తృతం చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా విషయంలో అప్రమత్తంగా ఉండి పూర్తిగా నిర్మూలించాలని కర్నూలు సెబ్ స్టేషన్ సిబ్బందికి సూచించారు. పాత నేరస్తులందరిపై ముందస్తు నేర నిరోధం కింద బైండోవర్లు చేయాలని ఆదేశించారు. సమీక్షలో కర్నూలు సెబ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నర్సనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మరో నాలుగు రోజులే...

- కొత్తగా ఓటు నమోదుకు ఈసీ అవకాశం
- ఈ ఎన్నికల్లో ఓటు వేయాలంటే ఇదే చివరి గడువు
- జాబితాలో పేరు లేకపోతే ఏప్రిల్ 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు


కర్నూలు(సెంట్రల్): ఓటరు జాబితాలో మీ పేరుందా..లేకపోతే వెంటనే నమోదు చేసుకోండి. ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 15వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది. జిల్లాలో మొత్తం 20,30,377 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో పురుషులు 10,01,971, స్త్రీలు 10,28,096, ఇతరులు 310 మంది ఉన్నారు. ఇప్పటికీ జాబితాలో పేరు లేకపోతే నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మే 13వ తేదీన జరగనున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఇదే చివరి అవకాశం. దీన్ని చేజార్చుకుంటే ప్రజాస్వామ్యంలో వజ్రాయుధాన్ని కోల్పోయినట్లే. సాధారణంగా నామినేషన్ గడువు చివరి రోజు వరకు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల పరిశీలన, నోటీసుల జారీ, దరఖాస్తుదారుల సమాధానాల కోసం కనీసం వారం గడువు ఇవ్వాలి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 15వ తేదీ వరకే దరఖాస్తుల స్వీకరణకు అవకాశం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ప్రకటించారు. అప్పటి వరకు వచ్చిన దరఖాస్తులన పరిశీలించి అర్హులకు జాబితాలో చోటు కల్పిస్తున్నట్లు వివరించారు.

ఓట్ల తొలగింపునకు అవకాశం లేదు..

ఓటర్ల జాబితా నుంచి తొలగింపునకు ఇక అవకాశం లేదు. సార్వత్రిక ఎన్నికలు షెడ్యూల్ విడుదలైనందున ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘం ఫ్రీజింగ్ పెట్టింది. కాగా, ఇప్పటివరకు ఫారం–7 ద్వార వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రాసెస్ చేస్తారు. ఓట్లను తొలగించాలంటే కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి తీసుకొని తొలగిస్తారు. కొత్తగా అయితే ఓటర్ల తొలగింపునకు ఎలాంటి దరఖాస్తులు స్వీకరించరు.

మీ ఓటు ఉందో లేదో చూసుకోండి...

ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉంటుందన్న ఆలోచనలో ఉంటారు. తీరా ఎన్నికల రోజున జాబితాల పేరు లేకపోతే ఇబ్బంది పడుతుంటారు. ఆ రోజున ఏమి చేసినా జాబితాలో పేరు చేర్చడానికి అవకాశం ఉండదు. కాబట్టి ముందుగానే జాబితాలో తమ పేరు ఉందా లేదా అన్న విషయాన్ని పరిశీలించుకుంటే మంచిది. ఇందుకోసం ceoandhra వెబ్‌సైట్‌లోకి వెళ్లితే నో యువర్ ఓటు అనే ట్యాగ్‌లైన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే అసెంబ్లీ లేదా మండలి అనే ఆప్షన్ ఉంటుంది. అసెంబ్లీపై క్లిక్ చేస్తే పేజీ డిస్‌ప్లే అవుతుంది.అందులో ఉన్న ఓటరు వివరాలను నమోదు చేస్తే జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఒకవేళ లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఓటు హక్కు నమోదుతో సహా అన్ని రకాల సందేహాలకు 1950 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.



అంబులెన్స్ బహూకరణ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వైద్యశాలకు రూ. 50 లక్షల విలువైన అత్యాధునిక అంబులెన్సును కామినేని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శశిధర్ బహూకరించారు.గంగాధర మండపం వద్ద ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి అంబులెన్స్‌కు వాహన పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు మాట్లాడుతూ దేవస్థానం వైద్యశాలలో అత్యవసర సేవలు అందించడంతోపాటు రోగులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అత్యాధునిక అంబులెన్సు ఎంతగానో దోహదపడుతుందన్నారు. దాతలు ఇతోధికంగా వైద్యశాలకు విరాళాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం. హరిదాసు, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఐదు రోజులకు రూ. 42.24 లక్షల ఆదాయం

మహానంది: ఉగాది మహోత్సవాల సందర్భంగా మహానందీశ్వరుడి దర్శనార్థం లక్షలాది సంఖ్యలో కన్నడ భక్తులు తరలివచ్చారు. దీంతో మహానంది క్షేత్రం కళకళలాడుతూ కనిపించింది. గత ఐదు రోజుల్లో సుమారు 1.20 లక్షల మంది కన్నడ భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఐదు రోజులకు మహానంది ఆలయానికి రూ. 42,24,818 ఆదాయం వచ్చినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. గత ఏడాది రూ. 31,59,611 రాగా ఈ ఏడాది అదనంగా రూ. 10,65,207 వచ్చిందన్నారు. ప్రధానంగా ఆర్జిత సేవాటికెట్ల విక్రయం ద్వారా రూ. 31,71,615, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 3,82,240 వచ్చిందని ఆయన వివరించారు.

దంపతుల దుర్మరణం


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వినుకొండ (నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందిన సంఘటన వినుకొండ రూరల్ మండలం కొత్తపాలెం సమీపంలో గురువారం ఉదయం జరిగింది. వినుకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నంద్యాలకు చెందిన గంగారపు రాజగోపాలరెడ్డి, భార్య శివలక్ష్మీదేవి, కుమారుడు రాకేష్‌రెడ్డి ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తూ గుంటూరులో నివాసం ఉంటున్నారు. బ్యాంక్ పనుల నిమిత్తమై సొంతూరు నంద్యాల వెళ్తుండగా గుంటూరు- కర్నూలు జాతీయ రహదారిపై కొత్తపాలెం వద్ద కారు అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజగోపాలరెడ్డి (53), శివలక్ష్మీదేవి (48) అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం నడుపుతున్న రాజగోపాలరెడ్డి సీటులో ఇరుక్కుపోయి ప్రాణాలు విడిచాడు. కుమారుడు రాకేష్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న వినుకొండ సీఐ సాంబశివరావు, పోలీస్ సిబ్బందితో వెళ్లి కారులో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాలను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గాయపడిన రాకేష్‌రెడ్డిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హాహాకారాలు..ఆర్తనాదాలు

- ప్రభోత్సవంలో విద్యుత్ ప్రమాదం
- 13 మంది చిన్నారులకు గాయాలు
- ఆసుపత్రిలో కోలుకుంటున్న చిన్నారులు
- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే కాటసాని



గాయాలకు గురైన చిన్నారిని పరామర్శిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి , ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

కర్నూలు/కర్నూలు(హాస్పిటల్): ఉగాది పండుగ సందర్భంగా ఆ ప్రాంతమంతా సందడిగా ఉంది. అట్టహాసంగా ఆ ఊళ్లో ప్రభోత్సవం జరుగుతోంది. ఉన్నట్టుండి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడంతో అక్కడే ఉన్న 13 మంది పిల్లలు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఒక్కసారిగా కరెంటు షాక్ కొట్టడంతో పిల్లలు అల్లాడిపోయారు. ఎక్కువ శాతం మంది పిల్లలు స్పృహ తప్పిపోయారు. మరికొందరు గాయాలతో హాహాకారాలు చేశారు. ఈ క్రమంలో పిల్లలకు ఏమైందో ఏమోనని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చిన్నారులను కాపాడుకునేందుకు ఎవ్వరికి వారు తమకు తోచిన వైద్యం చేయసాగారు. కొందరు కాళ్లు, చేతులు రుద్దుతుంటే మరికొందరు పిల్లలకు ఛాతీపై చేతులతో ఒత్తుతూ సీపీఆర్ చేయసాగారు, ఇదే సమయంలో మరికొందరు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి రప్పించారు. వెంటనే అంబులెన్స్‌లు అక్కడికి రావడం, పిల్లలను వాటితో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం చకాచకా జరిగిపోయాయి. ఆసుపత్రిలో పెద్ద డాక్టర్లు అక్కడే ఉండటంతో సకాలంలో స్పందించి పిల్లల ప్రాణాలను కాపాడగలిగారు.

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో నిర్వహించిన ప్రభోత్సవం సందర్భంగా విద్యుత్ ప్రమాదం చోటు చేసుకుని 13 మంది చిన్నారులకు గాయాలయ్యాయి. గురువారం ఉదయం గ్రామంలోని ఊరువాకిలి నుంచి జాతీయ రహదారి ప్రక్కనున్న ఆంజనేయస్వామి గుడి వరకు ప్రభోత్సవం నిర్వహిస్తుండగా మార్గమధ్యంలోని కరెంటు సబ్ స్టేషన్ సమీపంలో ప్రభకు పైన ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో ప్రభకు చుట్టూ ఉన్న 8 నుంచి 12 ఏళ్ల లోపు పిల్లలు, మల్లికార్జున, అజయ్, ఉమామహేష్, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, గౌతమ్, మనీష్, అఖిలేష్, జశ్వంత్, పవన్,వరుణ్, కార్తీక్, సాత్విక్ తదితరులకు గాయాల య్యాయి. ఇందులో ముగ్గురు తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోవడంతో గ్రామంలోని కొంతమంది యువకులు అప్రమత్తమై చిన్నారులకు వెంటనే సీపీఆర్ చేయడం, అరికాళ్లు రుద్దడం వంటి చర్యలు చేపడుతూనే ఆటోలు, బైకుల్లో కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. షార్ట్ సర్క్యూట్ ఏర్పడిన వెంటనే గ్రామానికి చెందిన అనిల్ అనే వ్యక్తి అప్రమత్తమై మరో ఇద్దరు వ్యక్తులతో కలసి సబ్ స్టేషన్ వద్దకు పరిగెత్తుకుంటూ వెళ్లి అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందికి చెప్పి కరెంటు సరఫరాను నిలిపివేయించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ ప్రమాదానికి గురై ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకుని చిన్నారు ల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. గాయాలకు గురైన పిల్లలందరికీ చికిత్సలు చేస్తున్నామని, ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ చింతా ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 5 నుంచి 10 శాతం మాత్రమే కాలిన గాయాలు ఉన్నాయని, వైద్యనిపుణులు, పిల్లల డాక్టర్లు, ప్లాస్టిక్ సర్జన్లు పరీక్షలు చేసి అందరికీ సత్వర వైద్యం అందించినట్లు తెలిపారు.

సకాలంలో స్పందించిన వైద్యబృందం

ప్రమాదానికి గురైన చిన్నపిల్లలు ఆసుపత్రికి వస్తున్నారని వైద్యుల బృందానికి ఉదయం 7.30 గంటలకు సమాచారం అందింది. విషయం తెలుసుకున్న పెద్ద డాక్టర్లు వెంటనే ఆసుపత్రికి చేరుకుని సిద్ధంగా ఉన్నారు. గురువారం ఉదయం 8.30 గంటలకు ఆసుపత్రిలోని చిన్నపిల్లల విభాగానికి నేరుగా చేరుకున్నారు. ఆ సమయంలో డ్యూటీలో పెద్ద డాక్టర్లు ఉండటంతో ముందుగా పిల్లలకు ఆక్సిజన్ థెరపి చేశారు. ఆ తర్వాత ఐవీ ఫ్లూయిడ్ పెడుతూ నొప్పి నివారిణి, యాంటిబయాటిక్స్ మందులు పిల్లలకు ఇచ్చారు. మరికొందరు వైద్యులు పిల్లలకు గాయాలున్న చోట ఆయింట్‌మెంట్ రాశారు. అందరికీ 10 శాతం లోపే కాలిన గాయాలు ఉండటంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇందులో ప్రవీణ్, గౌతమ్, మనీష్‌లకు కొద్దిగా పరిస్థితి విషమంగా ఉండటంతో వారికి ప్రత్యేక వైద్యం అందించారు. మొత్తం 13 మంది పిల్లలకు వైద్యులు పెద్ద ఎత్తున మెరుగైన వైద్యం అందించడంతో వారు వెంటనే కోలుకున్నారు. చిన్నపిల్లల విభాగం, ప్లాస్టిక్ సర్జరీ విభాగం సంయుక్తంగా ఈ వైద్యప్రక్రియ కొనసాగించింది. ఇందులో చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానంద బాబు, ప్రొఫెసర్ డాక్టర్ సుహాసిని, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ ప్రకాష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ హిమబిందు, డాక్టర్ ప్రకాష్‌ఆనంద్, డాక్టర్ కృష్ణ, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ నాగార్జున, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడి డాక్టర్ మంజులబాయి, డాక్టర్ రాజారవి, డాక్టర్ చంద్రమౌళి, పీజీలు తదితరులు ఉన్నారు.

విద్యుత్ శాఖ తప్పిదం లేదు

కర్నూలు(అగ్రికల్చర్): కల్లూరు మండలం చిన్నటేకూరులో జరిగిన ఘటనకు సంబంధించి విద్యుత్ శాఖ తప్పిదం లేదని ఎస్‌ఇ ఎం.ఉమాపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ షాక్‌కు గురై 13 మంది పిల్లలు అస్వస్థతకు గురయ్యారనే సమాచారం అందిన వెంటనే ఇన్‌చార్జ్ ఈఈ వెంకటేశ్వర్లు, ప్రొటెక్షన్ విభాగం అధికారులతో కలసి సంఘటన ప్రాంతాన్ని పరిశీలించామని పేర్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యగా ఆ సమయంలో 11కేవీ విద్యుత్ నిలిపివేశామని, చిన్నటేకూరు గ్రామానికి సరఫరా చేసిన లైన్‌లలో విద్యుత్ సరఫరా లేదని, ప్రమాద విషయంలో విద్యుత్ శాఖ తప్పిదంలో లేదని తెలిపారు. ప్రభ వాహనానికి 3 కేవీ జనరేటర్‌ను ఏర్పాటు చేసుకున్నారని, ప్రమాదానికి జనరేటర్ నుంచి ఇనుముతో చేసిన ప్రభకు లైట్స్ కోసం వాడిన వైర్ల ద్వారా విద్యుత్ వచ్చి ప్రమాదం జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు. విచారణ కోసం తాము అక్కడికి వెళ్లేసరికి జనరేటర్‌ను తొలగించి ఉన్నారని ఆయన ప్రకటనలో తెలిపారు.

కనుల పండువగా రాయబారాది మహోత్సవం


రాయబారాది మహోత్సవంలో పాల్గొన్న అష్టపురం గ్రామాలకు చెందిన ఎడ్లు

- తరలివచ్చిన అష్టపురం గ్రామాల ప్రజలు

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరిదేవి రాయబారాది మహోత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో చౌడేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి అష్టపురం గ్రామాలైన పండ్లాపురం, వెంకటాపురం, అప్పలాపురం, విఠలాపురం, తిమ్మాపురం, సంకలాపురం, చెరువుపల్లె గ్రామాల నుంచి వచ్చిన ఎడ్ల బండిపై శ్రీ చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి గ్రామ సమీపంలోని తిమ్మారెడ్డి కుంట వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మ వారికి సారె సమర్పించి సంప్రదాయ బద్ధంగా ఒడిబియ్యం పోశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఎడ్ల బండిపై ఏర్పాటు చేసిన మండపంలో కొలువుంచి మేళాతాళాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


శ్రీ చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాలను తిమ్మారెడ్డి కుంటవద్దకు తీసుకెళ్తున్న భక్తులు

బిషప్ ప్యానల్‌కు నలుగురు ఎన్నిక


బిషప్ ప్యానల్‌కు ఎన్నికైన సంతోష్ ప్రసన్నరావు, నందం ఐజక్, సాల్మన్, ఐజక్ ప్రసన్న కుమార్

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ అధ్యక్ష ఖండపు బిషప్ నియామకానికి గురువారం జరిగిన ప్యానల్ ఎంపిక ఎన్నిక హోరాహోరీగా సాగింది. స్థానిక డయాసిస్ కార్యాలయ ఆవరణలో కమ్యూనిటీ హాల్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభమై పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. ఈ ఎన్నికల్లో 9 మంది అభ్యర్థులు బరిలో ఉండగా నలుగురు బిషప్ ప్యానల్‌కు ఎన్నికయ్యారు. సాయంత్రం 4 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించగా 9.30 గంటలకు ముగిసింది. మొదటి రౌండ్‌లో రెవరెండ్ సంతోష్ ప్రసన్నరావు 224 ఓట్లు, రెవరెండ్ నందం ఐజక్ 205 ఓట్లు, రెవరెండ్ సాల్మన్ 166 ఓట్లతో విజయం సాధించారు. రెండవ రౌండ్‌లో 249 ఓట్లతో ఐజక్ ప్రసన్నకుమార్ గెలుపొందారు. ఈ ఎన్నికల్లో 313 మంది ఓటింగ్‌లో పాల్గొన్నట్లు ఎన్నికల లేస్ ఆఫ్ కమిటీ చైర్పర్సన్ సాల్మన్ తెలిపారు. చెన్నైకు చెందిన సీనాడ్ డయాసిస్ అధికారులు త్వరలో నంద్యాల డయాసిస్ బిషప్‌ను ప్రకటించనున్నారు. ఎన్నికల అబ్జర్వర్లుగా సీనాడు (చెన్నై) డయాసిస్ కార్యాలయానికి చెందిన క్రిష్టఫర్, విజయ్‌కుమార్ డ్యాండీలు పాల్గొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల డయాసిస్ కార్యాలయం ఎదుట గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ ముందు నంద్యాల డయాసిస్ అధ్యక్ష ఖండపు పీఠాధిపతి(బిషప్) రైట్ రెవరెండ్ ఐజక్ వరప్రసాద్ మాట్లాడుతూ భక్తి మార్గంలో నడుస్తూ సత్ప్రవర్తన కలిగిన గురువులను ఎన్నుకోవాలని సూచించారు. గెలుపొందిన అభ్యర్థులను నంద్యాల డయాసిస్ సెక్రటరీ స్టాండ్లీ విలియం కేర్, పాస్టరేట్-1 సెక్రటరీ ప్రభుదాసు, స్టీఫెన్, పాస్టరేట్-2 సెక్రటరీ కిరణ్, బాలన్న, కమిటీ సభ్యులు, పాస్టరేట్-3 సెక్రటరీ వినయ్ సాగర్, ట్రెజరర్ ప్రేమ్‌నాథ్, సంఘ సభ్యులు, ఇతర పాస్టరేట్ల డీనరీ చైర్మన్లు, గురువులు అభినందించారు. అనంతరం పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు...

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


కుమ్మరి రాముడు(ఫైల్)

నందవరం: అంత్యక్రియలకు వెళ్లి వస్తూ ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన కనకవీడు క్రాస్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపిన వివరాల మేరకు... పూలచింత గ్రామానికి చెందిన కుమ్మరి రాముడు (44) తన బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బుధవారం దైవందిన్నె గ్రామానికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్నాడు. అలాగే దైవందిన్నె గ్రామానికి చెందిన మాలదాసరి రాముడు ఇబ్రహీపురం గ్రామంలో దేవర చూసుకుని తిరిగి బైక్‌పై అతివేగంగా వస్తూ కనకవీడు క్రాస్ రోడ్డు వద్ద కుమ్మరి రాముడి బైక్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో కుమ్మరి రాముడికి తీవ్ర గాయాలు కావడంతో అతనికి వెనుక బైక్‌పై వస్తున్న అన్న, బావమరుదులు 108 అంబుల్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం రాత్రి మృతి చెందాడు. మాలదాసరి రాముడుకి సైతం గాయాలు కావడంతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య ఉరుకుందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుత దాడిలో వ్యక్తికి గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట, లింగాలగట్టు గ్రామాల్లో చిరుతపులుల సంచారం భయాందోళనకు గురిచేస్తోంది. గురువారం తెల్లవారుజామున లింగాలగట్టు బోయ క్యాంపులో రాతం లక్ష్మీనారాయణ(32) బహిర్భూమికి వెళ్లగా అక్కడే ఉన్న చిరుత దాడి చేసింది. దీంతో గట్టిగా కేకలు వేయగా అది అక్కడి నుంచి పారిపోయింది. గాయపడ్డ లక్ష్మీనారాయణకు గురువారం శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు అందించారు. ఏపీజెన్‌కో కాలనీ పరిసరాల్లో కూడా చిరుత సంచరిస్తుండడంతో అక్కడి ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం బండ్లబజార్ సమీపంలో మేకలు, గొర్రెలను చిరుత చంపిన విషయం తెలిసిందే.

బెదిరింపు కేసులో పలువురి అరెస్ట్

పెద్దకడబూరు: పొలం తగాదాలో బెదిరింపులకు పాల్పడ్డ వారిపై కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపారు. వివరాలు.. మండల పరిధిలోని పులికనుమ గ్రామ పరిధిలో గత నెల 31వ తేదీన రైతు అప్పలయ్య గారి నాగరాజు పొలంలో 33 సెంట్ల వివాదాస్పద భూమికి సంబంధించి చిన్న ఈరన్న, మహాదేవ, నాగరాజు, పరమేష్, చంద్రయ్య, రఘునాథాచారి, శ్రీనివాసులు, రవికుమార్ అనే 8 మంది అక్రమంగా ప్రవేశించి లైసెన్స్ లేని తుపాకీతో బెదిరించారన్నారు. దీనిపై రైతు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. బుధవారం ఆరుగురిని, గురువారం ఇద్దరిని మొత్తం 8 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రంజాన్ వేళ విషాదం

- కౌలూరులో వాగులో పడి బాలుడి మృతి


అహ్మద్ సమీర్ మృతదేహం

పాణ్యం: రంజాన్ పండుగ వేళ కౌలూరు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామం ముందు ఉన్న వాగులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల ఉసేన్, రజియా కుమారుడు దూదేకుల అహ్మద్‌సమీర్ (13) తన చిన్నాన్న మహ్మద్ హుస్సేన్‌తో కలిసి బుధవారం నంద్యాలోని ఓ వివాహంలో పాల్గొని స్వగ్రామానికి వచ్చాడు. రంజాన్ పండుగ సందర్భంగా సాయంత్రం గ్రామ సమీపంలోని వాగు వద్ద చిన్నాన్న మహ్మద్ హుస్సేన్ బైక్‌ను శుభ్రం చేస్తూ అహ్మద్ సమీర్ వాగులో ఈదుతున్నాడు. బైక్ శుభ్రం చేసిం తర్వాత చూస్తే వాగులో సమీర్ కనిపించలేదు. దీంతో మహ్మద్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు సమాచారం చేరవేయడంతో వా గులో గాలించి అచేతనంగా ఉన్న అహ్మద్ సమీర్‌ను బయటకు తీసి చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రికి తరలించారు.కొలుకోలేక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

శోకసంద్రంలో తల్లిదండ్రులు..

ఏకైక కుమారుడైన అహ్మద్ సమీర్‌ను నంద్యాలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో ఆరో తరగతి చదివిస్తున్నారు. రంజాన్ పండుగ వేళ కుమారుడికి కొత్త దుస్తులు తెచ్చారు. అయితే చిన్నాన్నతో పాటు బైక్ శుభ్రం చేసుకునేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. తమ ఆశల దీపం ఆరిపోవడంతో వారి ఆర్తనాదాలు మిన్నంటాయి.

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు..


బాలుడు రామును తల్లి సుజాతకు అప్పగిస్తున్న పోలీసు

ఆదోని అర్బన్: బెంగళూరు నుంచి వివాహ వేడుకలకు తల్లిదండ్రులతో కలిసి ఆదోనికి వచ్చిన రాము అనే పదేళ్ల బాలుడు ఆడుకుంటూ తప్పిపోయి ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. సీఐ తేజమూర్తి బాలుడిని విచారించగా తల్లిదండ్రులు సుజాత, అంజిని అని, బెంగళూరు నుంచి ఆదోని బోయగేరిలో అక్క పెళ్లి కోసం వచ్చినట్లు చెప్పాడు. తల్లిదండ్రుల సెల్ నంబర్ తెలియదని చెప్పడంతో సీఐ సామాజిక మాధ్యమాల ద్వారా బాలుడి ఫొటో, సమాచారాన్ని పోస్టు చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా వారికి బాలుడిని అప్పగించారు. పిల్లల జేబులో కానీ, చేతిపై గానీ తల్లిదండ్రుల సెల్‌ఫోన్ నంబర్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి


రాఘవేంద్ర (ఫైల్)

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన వీఆర్వో ఎస్.రాఘవేంద్ర (40) గుండెపోటుకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం సాయంత్రం ఇంట్లో ఉన్న రాఘవేంద్రకు ఉన్నట్టుండి గుండెనొప్పి రావడంతో ప్రైవేట్ వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఆయన ప్రస్తుతం కోసిగి మండలం అగసనూరు వీఆర్వోగా పనిచేస్తున్నారు. రాఘవేంద్ర ఆకస్మిక మృతి పట్ల తోటి వీఆర్వోలు, మండల రెవెన్యూ అధికారులు సంతాపం తెలిపారు. మృతిని భార్య భార్య సరస్వతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సంక్షేమ బావుటా
లంచాలు లేకుండా పథకాలు అందాయి



మాకు ఎకరా పొలం ఉంది. అందులో పంట వేసుకుంటాం. మిగిలిన సమయంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు ఇద్దరు కుమార్తెలు మధుప్రియ, మనీషా, కొడుకు మణితేజ ఉన్నారు. మధుప్రియ పత్తికొండ బీసీ హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతోంది. మధుప్రియకు ఇప్పటి వరకు అమ్మఒడి కింద మొత్తం రూ.45వేలు వచ్చాయి. మాకు పీఎం కిసాన్-రైతు భరోసా కింద ఏటా రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందుతోంది. మా అమ్మ ఎల్లమ్మకు ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. మేం చిన్నగా ఉండే మట్టి మిద్దె ఇంట్లో ఉండేవాళ్లం. మాకు పక్కా ఇల్లు మంజూరైంది. రూ.1.20లక్షలు బిల్లు కూడా వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ప్రకారం మాకు రావాల్సిన పథకాలన్నీ రూపాయి లంచం లేకుండా వచ్చాయి. ఇలాంటి ప్రభుత్వం మళ్లీ వస్తేనే మాలాంటి పేదలకు ఇబ్బంది లేకుండా పథకాలు ఇంటికే వస్తాయి.

– బూతన్న లక్ష్మి, బాలు, పెండేకల్లు గ్రామం, తుగ్గలి మండలం